సాక్షి సిద్దిపేట

గురువారం । 8 । ఆగస్టు । 2024



మెరిసిన చేనేత పద్మాలు

చేనేత కార్మికుల వృత్తి నైపుణ్యాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. గొల్లభామ, రామప్ప చీరలకు అవార్డులు వరించాయి.


వివరాలు 8లో ▸



మంజీరా తీరం.. పచ్చలహారం

మంజీరా తీరం పచ్చలహారంగా కనిపిస్తోంది. తీరం వెంబడి జోరుగా సాగు పనులు మొదలు పెట్టారు.

వివరాలు 8లో ▸



బురద దారి.. ఎలా చేరేది?

గ్రామాల్లో రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు సరైన దారులు లేవు. పైగా అవి చిత్తడిగా మారడంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

చేనేత కష్టాలు తీర్చండి

ప్రధానికి విన్నవించిన ఎంపీ రఘునందన్‌రావు



మోదీని నూలు పోగుల దండతో సత్కరించిన ఎంపీ

దుబ్బాక: చేనేత కష్టాలు తీర్చాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రధాని నరేంద్రమోదీకి విన్నవించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం ఢిల్లీలో ప్రధానమంత్రిని కలిసి నూలు పోగుల దండతో సత్కరించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు కడుదయనీయమైన స్థితిలో ఉన్నారని, వారిని ఆదుకోవాలని విన్నవించినట్లు రఘునందన్‌రావు 'సాక్షి'కి ఫోన్‌లో తెలిపారు. తప్పకుండా చేనేత కార్మికుల సంక్షేమంపై దృష్టి సారిస్తామని పీఎం తెలిపారన్నారు. దుబ్బాక, సిద్దిపేట, మెదక్, గజ్వేల్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు అసెంబ్లీ నియోజక వర్గాల పరధిలో ఉన్న చేనేత కార్మికుల పరిస్థితి, వారికి కావాల్సిన సదుపాయాలు, ఉపాధి తదితర విషయాలను ప్రధానికి వివరించినట్లు తెలిపారు.

రామరాజుకు 'సేవారత్న' పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న రామకోటి రామరాజు

గజ్వేల్: పట్టణానికి చెందిన రామకోటి రామరాజుకు లక్ష్మీప్రసన్న చారిటబుల్ సంస్థ సేవారత్న పురస్కారాన్ని అందజేసింది. బుధవారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనందభాస్కర్, ప్రజాగాయకుడు ఏపూరి సోమన్నల చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి ఈ సంస్థ పురస్కారాలను అందజేస్తుండగా, 25ఏళ్లగా రామకోటి లిఖించే కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహిస్తూ ఆధ్యాత్మిక రంగంలో తనదైన శైలిని చాటుతుండటంతో ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు లక్ష్మీప్రసన్న, సామశ్రీధర్, వెంకటేశ్‌గౌడ్, సామ ప్రశాంతి, అంజయ్యస్వామి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

దుబ్బాక ప్రథమ శ్రేణి న్యాయమూర్తి తరణి



న్యాయమూర్తికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దుబ్బాకటౌన్: ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని దుబ్బాక ప్రథమ శ్రేణి న్యాయమూర్తి తరణి అన్నారు. బుధవారం పట్టణంలో ఆర్యవైశ్య భవన్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ సిద్దిపేట లయన్స్ క్లబ్ వారు ఆర్‌వీఎం డాక్టర్లతో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేయడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ జోషి మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్ ఎస్‌ఐ గంగరాజు, డాక్టర్లు తదితరులున్నారు.

సీపీని కలిసిన నూతన ఎస్‌ఐలు



సీపీ అనురాధకు మొక్కను అందజేస్తున్న ఎస్‌ఐ నిరేష్

సిద్దిపేటకమాన్: చేర్యాల, మద్దూరులో బాధ్యతలు చేపట్టిన నూతన ఎస్‌ఐలు పి.నిరేశ్, షేక్ మహబూబ్ సీపీ అనురాధను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

సాగు సగమే..

- ఇప్పటి వరకు 3.05లక్షల ఎకరాల్లోనే పంటలు
- భారీగా తగ్గిన వరి
- గోదావరి గలగలలతో సాగు పెరిగే అవకాశం
- స్వల్పకాల రకాలే వేయాలంటున్న శాస్త్రవేత్తలు

జిల్లా వ్యాప్తంగా వ్యవసాయం సగమే అయ్యింది. పలు ప్రాంతాల్లో వర్షాలు తక్కువగా కురవడంతో వరి నాట్లు ఇప్పటికీ వేయలేదు. దీంతో గతేడాది కంటే వరి చాలా తక్కువగా సాగవుతోంది. గోదావరి జలాలు రంగనాయకసాగర్‌కు చేరుతుండటంతో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌ల ద్వారా చెరువులను నింపనున్నారు. దీంతో మరో 15 రోజుల్లో సాగు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు వరి నారు పోయని వారు వెదజల్లె పద్ధతిలో సాగు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. - సాక్షి, సిద్దిపేట



జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌కు చెందిన రైతు నాగెల్లి బుచ్చిరెడ్డి.. సకాలంలో వానలు కురవకపోవడంతో పొలంలోనే వదిలేసిన నారు

సాధారణంగా వరి నాట్లు ఆగస్టు మొదటి వారం వరకు పూర్తి అవుతాయి. ఈ సారి వర్షాలు ఎక్కువగా కురవకపోవడంతో నారు పోసినా నాట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. పలు చోట్ల నారు ముదిరిపోయింది. గతేడాది వానకాలంలో 5,20,690 ఎకరాలు సాగైతే ఇప్పటి వరకు 3,05,910 ఎకరాలు మాత్రమే సాగు అవుతోంది. గతేడాడి వరి 3,79,108 ఎకరాలు సాగు అయితే ఇప్పటి వరకు 1,63,341 ఎకరాలే సాగు అయినట్లు సమాచారం. గతంతో పోలిస్తే సుమారు 2లక్షల ఎకరాల మేర తక్కువగా సాగవుతుంది. ఇంకా వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

పలు మండలాల్లో లోటు వర్షపాతం

జిల్లాలో ఇప్పటి వరకు సగటు వర్షపాతం కంటే ఎక్కువగానే వర్షం కురిసింది. పలు మండలాల్లో లోటు, సాధారణ, అధిక వర్షపాతం నమోదైంది. లోటు వర్షపాతం వర్గల్, ములుగు, మర్కూక్, జగదేవ్‌పూర్, కొమురవెల్లిలలో నమోదు కాగా, సాధారణ వర్షపాతం హుస్నాబాద్, దుబ్బాక, సిద్దిపేట అర్బన్, దౌల్తాబాద్, రాయపోలు, గజ్వేల్, కొండపాక, చేర్యాలలో నమోదైంది. అలాగే అధిక వర్షపాతం సిద్దిపేట రూరల్, చిన్నకోడూరు, బెజ్జంకి, కోహెడ, అక్కన్నపేట, నంగనూరు, తొగుట, మిరుదొడ్డి, మద్దూరు, దూల్మిట్ట, నారాయణరావుపేట, అక్బర్‌పేట భూంపల్లి, కుకునూరుపల్లిలలో నమోదైనట్లు అధికారులు తెలిపారు. గోదావరి జలాలతో చెరువులను నింపే అవకాశం ఉండటంతో మరో 15 రోజుల్లో సాగు పెరిగే అవకాశం ఉంది.

ప్రస్తుతం సాగు వివరాలు

పంటల	ఎకరాలు
వరి	1,63,341
పత్తి	94,269
మొక్కజొన్న	21,024
కంది	4,163
ఇతర	23,113

స్వల్పకాల రకాలను ఎన్నుకోండి



ఇప్పటి వరకు వరి నారు పోయని వారు స్వల్పకాలంలో దిగుబడిని ఇచ్చేవాటిలో దొడ్డు రకమైతే జేజీఎల్24423, ఎంటీయూ 1010, సన్నాలు అయితే ఆర్‌ఎన్ఆర్ 15048 రకాలను ఎంచుకోవాలి. అవి కూడా దున్ని, వేదజల్లె పద్ధతిలో సాగు చేసుకోవాలి. ఈ నెల 15వ తేదీ వరకు నాట్లు వేసుకోవచ్చు. నారు ముదిరితే (50 రోజులు) కొనలు తుంచి నాలుగు నుంచి ఐదు పిలకలు నాటుకుని 25శాతం అధిక నత్రజని వేసుకోవాలి. మొగి పురుగు నివారణకు నారు మడిలో 800గ్రాములు కార్బొఫ్యూరాన్ 3సీజీ గూలికలు వేసుకోవాలి. నాటు వేసిన 20 రోజులకు కార్బొఫ్యూరాన్ గూలికలు ఎకరాకు 8 నుంచి 10 కిలోలు వేసుకోవాలి. –డాక్టర్ పల్లవి, శాస్త్రవేత్త

పెరిగే అవకాశం



పలు చోట్ల తక్కువ వర్షం కురవడంతో కొందరు వరి నాట్లు వేయలేదు. ఈ నెల 20వ తేదీ వరకు 80శాతం వరి నాట్లు పడే అవకాశం ఉంది. ఐదు మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. – మహేశ్, డీఏఓ

అందరికీ సంక్షేమ పథకాలు



జిల్లెలగడ్డలో ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న మంత్రి పొన్నం, చిత్రంలో కలెక్టర్ తదితరులు

- రైతులకు అవగాహన కల్పించాలి
- 4వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు చర్యలు
- గొర్రెలు, కోళ్ల పెంపకం చేపడితే మరింత ఆదాయం
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ రైతులకు సంక్షేమ పథకాలు అందే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం మీర్జాపూర్ రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. రైతులకు వ్యవసాయ అనుబంధమైన పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆదాయం పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొర్రెలు, కోళ్లు, పాడి పరిశ్రమలకు రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు 50 శాతం సబ్సిడీ రుణాలు ఇస్తున్నాయన్నారు. మెట్టప్రాంత రైతులు వరి, పత్తి సాగుపై ఆధారపడకుండా అనుబంధ రంగాల వైపు మొగ్గు చూపాలని, అప్పుడే ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తామన్నారు. రైతు బిడ్డగా రైతుల కష్టం తెలుసని, లాభదాయకమైన పంటలు సాగు చేసేందుకే చర్యలు చేపడుతున్నామన్నారు. గొర్రెలు, పాడి పరిశ్రమ, చేపలు, కోళ్ల పెంపకం చేసే రైతులు ముందుకు వస్తే వారికి సబ్సిడీపై రుణాలను ఇప్పించేందుకు కలెక్టర్ చర్యలు తీసుకుంటారన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 11 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేశారని, ఈ ఏడాది మరో 4వేల ఎకరాల ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లెలగడ్డలో రైతు వీరన్న 30 ఎకరాలల్లో సాగు చేస్తున్న ఆయిల్ పామ్‌లో మొక్కలు నాటి రైతును అభినందించారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు పొందటానికి కావాల్సిన పత్రాలను ఏఈఓ, ఏఓల దగ్గర అందుబాటులో ఉంచుతామన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి..

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జిల్లెలగడ్డలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. వంటగదిలోని కూరగాయలు, ఇతర సామగ్రిని పరిశీలించి సమస్యల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారిని సువర్ణ, పశుసంవర్ధకశాఖ జేడీ జగత్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ రామ్మూర్తి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈ నాగరాజు, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య పాల్గొన్నారు.



క్రీడాకారులకు దుస్తులను అందజేస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సిర్సనగండ్లలోని పాఠశాలలో మిరుదొడ్డి అనంతరామారావు సహకారంతో క్రీడాకారులకు బుధవారం దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రోజూ సాయంత్రం వేళలో వివిధ రకాల క్రీడా నైపుణ్యాలపై వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాలన్నారు. బతకడానికి చదువు ఎంత ముఖ్యమో క్రీడా రంగం సైతం అంతే ముఖ్యంగా దోహదపడుతుందన్నారు. విద్యార్థులు క్రీడా రంగంపై మక్కువ పెంచుకోవాలన్నారు. క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి,హెచ్‌ఎం పెద్ది విఠల్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఉప్పలయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాట్లు వేసి నిరసన

అక్కన్నపేట(హుస్నాబాద్): రోడ్లు అధ్వానంగా మారినా ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం రోడ్లపై నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లంబాడ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు భూక్య కృష్ణనాయక్ మాట్లాడుతూ మైసమ్మవాగుతండా గ్రామ పరిధిలోని మబ్బుకుంట, రంగన్నకుంట, బండమీదితండా, కోక్యనాయక్‌తండాల రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయన్నారు. ఏళ్లగా తారురోడ్డు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నామన్నారు. అనేక మంది గోతుల్లో పడి గాయాలబారిన పడ్డారన్నారు. కనీసం 108అంబులెన్స్ సైతం రానీ దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వారు కోరారు.



మైసమ్మవాగుతండా రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పకడ్బందీగా అట్రాసిటీ అమలు

- కేసులు త్వరితగతిన పరిష్కరించాలి
- ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- జిల్లా అధికారులకు దిశానిర్దేశం

సిద్దిపేటరూరల్: జిల్లా ఎంతో చైతన్యవంతగా ముందు వరుసలో నిలిచిందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు నమోదైన అట్రాసిటీ కేసుల వివరాలను కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ కమిషన్‌కు వివరించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం అందేలా కేసులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలు చేస్తూ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలన్నారు.

హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించాలి

మారుమూల ప్రాంతాల నుంచి విద్య కోసం వచ్చే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా హాస్టల్లో, గురుకులాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. హాస్టళ్లలో ప్రవేశం కోరిన వారికి తప్పకుండా ప్రవేశం కల్పించాలని బక్కి వెంకటయ్య సూచించారు. హాస్టళ్లకు సొంత భవనాల నిర్మాణం , జిల్లా కేంద్రంలో బంజారా భవన్ నిర్మాణానికి స్థలాలను కేటాయించాలన్నారు. హుస్నాబాద్ పట్టణంలో నిర్మించిన బంజారా భవన్ కు రోడ్డు నిర్మించి వినియోగంలోకి తేవాలన్నారు. కొత్త గ్రామ పంచాయతీల్లో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్, సీపీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరగకుండా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. దాడులు జరిగితే దాడి చేసిన వారికి త్వరగా శిక్షపడి బాధితులకు పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్ కుమార్, కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, అదనపు డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి, ఎస్సీ అభివృద్ధి అధికారి కవిత, గిరిజన అభివృద్ధి అధికారి అఖిలేష్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ సీతారాం రెడ్డి, సిద్దిపేట గజ్వేల్, హుస్నాబాద్ ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.



బక్కి వెంకటయ్యను సన్మానిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కండక్టర్ సస్పెన్షన్

ఆగిన జనగామ డిపో బస్సులు

చేర్యాల(సిద్దిపేట): ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలతో జనగామ ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న ఓ కండక్టర్‌ని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీనికి నిరసనగా డిపోలో పనిచేస్తున్న కండక్టర్లందరూ బుధవారం విధులు బహిష్కరించారు. ఒక్క బస్సు కూడా డిపో నుంచి బయటకు పోనివ్వలేదు. ఈ క్రమంలో చేర్యాల మీదుగా ప్రతి రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు నడిచే బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఉదయాన్నే విధులకు హాజరయ్యే ఉద్యోగులు, కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

చేనేత సంక్షేమం కోసం ప్రత్యేక ప్రణాళికలు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేటజోన్: చేనేత కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత రంగంలో ఉన్న కార్మికులకు ఉపాధి లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామన్నారు. చేనేత కార్మికులు మార్కెటింగ్ రంగంలో ఉన్న పోటీని తట్టుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ముందుకు సాగాలని సూచించారు. నూతన పోకడలను అనుగుణంగా చేనేత ఉత్పత్తులు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం చేనేత రంగంలో సేవలు అందించిన కార్మికులను సన్మానించారు. చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకుముందు చేనేత వాక్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పద్మాశాలి సమాజం అధ్యక్షుడు డాక్టర్ సతీష్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఆరోగ్య సమాజాన్ని నిర్మిద్దాం

- అందరూ భాగస్వాములు కావాలి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోలికేరి

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని, అందరి సహకారంతోనే ఆరోగ్య సమాజాన్ని నిర్మిద్దామని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోలికేరి అన్నారు. బుధవారం గజ్వేల్‌లోని రాజీవ్ పార్కు, డంపింగ్‌యార్డుతో పాటు ఇంటింటి ఫీవర్ సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, ప్రజలు ఇంటితో పాటు పరిసరాలను సైతం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మొక్కను నాటి నీరు పోశారు. అదే విధంగా మండల పరిధిలోని బయ్యారంలో కంపోస్ట్ తయారీని పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ జయదేవ్, డీపీఓ దేవకీదేవి, గజ్వేల్ మండల ప్రత్యేకాధికారి సువర్ణ, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నర్సయ్య, వైస్‌చైర్మన్ జకియొద్దీన్, శ్రీగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బల్వీర్‌సింగ్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న భారతి హోలికేరి

స్వచ్ఛదనం సక్సెస్ చేయాలి

ములుగు(గజ్వేల్): స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి భారతి హోలికేరి సూచించారు. జప్తిసింగాయిపల్లిలో బుధవారం నిర్వహించిన కార్యమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. గ్రామసభలో మాట్లాడుతూ ప్రజలు వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమన్నారు. రోజురోజుకీ తరిగిపోతున్న వృక్ష సంపద కారణంగానే వాతావరణ సమతుల్యత దెబ్బతింటోందని అందుకు ప్రతిఒక్కరు మొక్కలు నాటాలన్నారు. భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు ఎంతగానో దోహద పడతాయన్నారు. స్వచ్ఛత, పరిశుభ్రత, మొక్కల పెంపకం వంటి విషయాలపై అధికారులు అవగాహన కల్పించాలన్నారు.

నవోదయలో క్రీడా సంరంభం షురూ..

వర్గల్(గజ్వేల్): వర్గల్ నవోదయ వేదికగా క్లస్టర్ స్థాయి అథ్లెటిక్ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రన్నింగ్, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, హర్డిల్స్ తదితర విభాగాలలో క్రీడాకారుల పోటీలు జరిగాయి. చిరు జల్లులు కురవడంతో ఆటలకు అంతరాయం కలిగింది. అథ్లెటిక్ టోర్నీ ప్రారంభోత్సవానికి వర్గల్ తహసీల్దార్ బాల్‌రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రీడాజ్యోతి ప్రజ్వలన చేసి టోర్నీని ప్రారంభించారు. విద్యార్థులు ఆటలలోనూ సత్తాచాటుతూ జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తాము చదువుతున్న విద్యాలయానికి వన్నెలద్దాలన్నారు. ఆతిథ్య నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి చాటుతూ అథ్లెటిక్ మీట్ జయప్రదం చేయాలన్నారు. ప్రారంభోత్సవం అనంతరం వివిధ జిల్లాల విద్యార్థిలోకం అథ్లెటిక్ పోటీలలో మునిగిపోయారు. ప్రాథమిక దశ పోటీలు బుధవారం జరగగా, గురువారం అన్ని విభాగాలలో ఫైనల్ పోటీలు కొనసాగనున్నాయి. చక్కటి ప్రతిభ చాటిన విద్యార్థులను రీజినల్ మీట్‌కు ఎంపిక చేయనున్నారు. కాగా గురువారం ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్



అథ్లెటిక్ మీట్‌లో విద్యార్థి హైజంప్

క్లుప్తంగా

రైల్వే బ్రిడ్జి నిర్మించాలి

- కేంద్ర మంత్రికి ఎంపీ రఘునందన్‌రావు వినతి



రైల్వేమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్‌జోన్/చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని మెదక్ రోడ్డు రైల్వే గేటు వద్ద రైల్వే బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ రఘునందన్‌రావు వినతిపత్రం అందించినట్లు దుబ్బాక నియోజకవర్గ కో కన్వీనర్ గోవింద్ తెలిపారు. బుధవారం ఢిల్లీలోని రైల్వే మంత్రిని రఘునందన్‌రావు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తోపాటు కలిశారు. సర్వే పూర్తి చేసిన తెల్లాపూర్ సిద్దిపేట రైల్వేలైన్ పనులు ప్రారంభించాలని కోరారు. చేగుంట శివారులోని రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మించాలని కోరినట్లు పేర్కొన్నారు. అలాగే, తెల్లపూర్ నుంచి సిద్దిపేట వరకు సర్వే పూర్తయిన రైల్వే లైన్ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.

అంబులెన్స్‌ను చోరీ చేసి తీసుకెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో దొంగకు గాయాలు, దెబ్బతిన్న వాహనం



ప్రమాదస్థలంలో నుజ్జునుజ్జయిన వాహనం

కొండపాక(గజ్వేల్): ప్రైవేటు అంబులెన్సు వాహనాన్ని చోరీ చేసిన వ్యక్తి అడ్డంగా దొరికిపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. కొండపాక గ్రామానికి చెందిన నవీన్ సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అంబులెన్సును అద్దెకు పెట్టుకున్నాడు. ఆస్పత్రి ఎదుట వాహనాన్ని నిలిపి తాళం చెవి వాహనానికే పెట్టి లోపలికి వెళ్లాడు. దీన్ని గమనించిన అశోక్ అంబులెన్సు వాహనాన్ని దొంగిలించి హైదరాబాద్ వైపునకు వెళ్తూ దుద్దెడ శివారులో టోల్ ప్లాజాను గుర్తించాడు. మళ్లీ వాహనాన్ని యూటర్న్ చేసుకొని సిద్దిపేట వైపునకు అతి వేగంగా వెళ్తున్నాడు. దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొని వాహనం ఆగిపోయింది. ఈ ప్రమాదంలో అశోక్‌కు తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్ దెబ్బతింది. చోరీకి యత్నించిన వ్యక్తి మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామవాసిగా గుర్తించారు. దుద్దెడ శివారులో అంబులెన్స్ వాహనాన్ని పట్టుకోగా చోరీకి గురైంది సిద్దిపేట వన్ టౌన్ పరిధిలోకి రావడంతో కేసును అక్కడికి తరలించినట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు.

న్యాయవాదుల రక్షణకు..

- ప్రత్యేక చట్టం రూపొందించాలి



ధర్నా చేస్తున్న న్యాయవాదులు

హుస్నాబాద్: న్యాయవాదులపై పోలీస్‌ల భౌతిక దాడులను నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం హుస్నాబాద్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్ మాట్లాడుతూ.. జనగామ పోలీస్ స్టేషన్‌కు న్యాయవాద దంపతులు ఓ కేసు నిమిత్తం వెళ్తే వారిపై అక్కడి సీఐ, పోలీస్‌లు దురుసుగా ప్రవర్తించి భౌతిక దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. చట్టపరంగా ప్రజల హక్కులను కాపాడేందుకు న్యాయవాదులు పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కన్నోజు రామకృష్ణ, న్యాయవాదులు జూమ్లా నాయక్, చిత్తారి రవీందర్, చిత్తారి హన్మయ్య, దేవదాస్, అజయ్, రవీందర్, సంపత్, ప్రవీణ్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మంజీరా నది పరీవాహకం



వరి నాట్లు వేస్తున్న రైతులు

మంజీరా తీరం.. పచ్చలహారం

మంజీరా తీరం పచ్చలహారంగా కనిపిస్తుంది. వర్షాభావ పరిస్థితుల్లో కూడా నీరు లభ్యమవుతుండటంతో రైతులు తీరం వెంబడి మోటార్లు బిగించి పంటలు పండిస్తున్నారు. సింగూరు ప్రాజెక్టు నుంచి నిజాం సాగర్ ప్రాజెక్టుకు, ఘనపూర్ ఆయకట్టుకు నీటి విడుదల చేస్తారు. అలాగే, మంజీరా బ్యారేజ్ ద్వారా జంట నగరాల తాగు నీటికి నిరంతరం నీళ్లు అవసరం కావడంతో సింగూరు నుంరి నీటి వదులుతారు. ఈ క్రమంలో మంజీరా పరివాహకం ఎప్పుడూ నీటితో జలకళ సంతరించుకుంటుంది. నీళ్లు పుష్కలంగా ఉండటంతో రైతులు జోరుగా సాగు పనులు మొదలు పెట్టారు.

– పుల్‌కల్(అందోల్)

- నది చుట్టుపక్కల పెరిగిన సాగు
- మోటార్‌లను బిగింపు పైపులైన్‌లతో పంటలకు నీళ్లు
- వర్షాభావంలోనూ తగ్గని నీటి ప్రవాహం
- సంగారెడ్డి, మెదక్ జిల్లాలో 105 కిలోమీటర్ల మేర ప్రవాహం
- సింగూరు ప్రాజెక్ట్ నుంచి నిరంతరం నీరు విడుదల

గోదావరికి ఉపనది అయిన మంజీరా సంగారెడ్డి, మెదక్ జిల్లాలో 105 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. మంజీరా నదిపై 1976లో సింగూరు ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించి, 1988 నుంచి దశల వారీగా నీటిని నిల్వ చేస్తున్నారు. 30 టీఎంసీల సామర్థ్యం గల డ్యాం నుంచి దిగువన ఉన్న నిజాంసాగర్, ఘనపూర్ ఆయకట్టుకు సాగునీటిని, మంజీరా బ్యారేజ్‌లోకి తాగునీటిని దశల వారీగా విడుదల చేస్తుండటంతో మంజీరా నది ఎప్పుడూ జీవకళను సంతరించుకుంటుంది.

తీరం వెంబడి సాగు సందడి..

తీరం వెంబడి డ్యామ్‌కు ఎగువభాగంలో నారాయణఖేడ్ ప్రాంతంలోని మండలాలు, డ్యామ్‌కు దిగువన సింగూరు నుంచి నిజామాబాద్ వరకు వేల మోటార్లు బిగించి లక్షల ఎకరాల్లో సాగు చేసుకుంటున్నారు. మోటార్లతోపాటు సింగూరు కుడి, ఎడమ కాల్వల ద్వారా 40 వేల ఎకరాలు, అందోల్ నియోజకవర్గంలోని చెరువుల కింద 10 వేల ఎకరాలు, ఘనపూర్ ఆయకట్టు కింద లక్ష ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు.

తీరం సుభిక్షం..

మంజీరా నది పరీవాహకంలో వర్షాభావ పరిస్థితుల్లో కూడా సాగు, తాగు నీటికి ఢోకా ఉండదు. రైతులు మోటార్లు పెట్టి మంజీరా నదిలో నుంచి సాగునీటిని వాడుకొని పంటలు పండిస్తున్నారు. మంజీరా నది తీరంలో ఉన్న భూముల విలువ ఎక్కువ. దీంతో కొందరు మంజీరా నది తీరం వెంబడి భూములు కొని ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కూడా తీరం భూముల్లో రైతులు పంటలు పండిస్తున్నారు. నీరు సమృద్ధిగా ఉండటంతో వరి పంటను ఎక్కువగా సాగుచేస్తున్నారు. పదేళ్లుగా ప్రభుత్వాలు సాగుకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తుండటంతో రైతులు ఇబ్బడి ముబ్బడిగా పంటలు పండిస్తున్నారు.


పరీవాహకంపై రైతుల మక్కువ



మంజీరా నది తీర ప్రాంతంలోని భూముల్లో వర్షాభావ పరిస్థితుల్లో కూడా వ్యవసాయం చేయొచ్చు. సాగునీటికి ఢోకా ఉండదు. రైతులు పెద్ద పెద్ద మోటార్‌లను బిగించి సాగు చేస్తున్నారు. మంజీరా నది తీరానికి దూరంగా ఉన్న భూముల్లోని రైతులు కూడా పైపులైన్ వేసి సాగు చేసుకుంటున్నారు.

– కలాలి మల్లేశం గౌడ్, రైతు, ముదిమాణిక్యం

సింగూరు ప్రధానం..



సంగారెడ్డి, మెదక్ జిల్లాల తాగు, సాగునీటికి సింగూరు ప్రాజెక్టు ప్రధాన భూమిక పోషిస్తుంది. 30 టీఎంసీల సామర్థ్యం గల సింగూరు ప్రాజెక్టు నుంచి పది నియోజకవర్గాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తారు. మిషన్ భగీరథకు 17 టీఎంసీల వరకు నీటిని వినియోగిస్తున్నారు. మిగితా నీటిలో సింగూరు ఆయకట్టుకు 4 టీఎంసీలు, ఘనపూర్ ఆయకట్టుకు 4 టీఎంసీలు, హైదరాబాద్ తాగునీటికి 4 టీఎంసీలను కేటాయించారు.

మెరిసిన చేనేత పద్మాలు

- సిద్దిపేట నేతన్నలకు గుర్తింపు
- గొల్లభామ, రామప్ప చీరెలకు చోటు
- రాష్ట్ర స్థాయిలో అవార్డులు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా స్వీకారం



లక్ష్మయ్య, శ్రీరాములను సన్మానిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సిద్దిపేటజోన్: సిద్దిపేట చేనేత కార్మికుల అద్భుతమైన వృత్తి నైపుణ్యాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన సిద్దిపేట బ్రాండ్ అంబాసిడర్ గొల్లభామ చీరకు వరుసగా ఏడు సంవత్సరాలుగా రాష్ట్ర స్థాయి అవార్డు దక్కించుకుంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి చేనేత కార్మికుల ప్రతిభాపాటవాల్ని గుర్తించి కొండా లక్ష్మణ్ బాపూజీ స్మారక అవార్డుల పేరిట సత్కరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర కమిషనర్ శైలజా రామయ్యర్ చేతుల మీద అవార్డులు అందుకున్నారు. నగదు పురస్కారం, మెమోంటో, ప్రశంసాపత్రంతో సిద్దిపేటకు చెందిన సిరిగాది లక్ష్మయ్య, బుగ్గ శ్రీరాములను ప్రభుత్వం ఘనంగా సన్మానించింది.

చేనేత కార్మికుల వృత్తి నైపుణ్యాలను గుర్తించి, వారిలో చేనేతపై ఉత్సాహం నింపే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట అవార్డులు అందజేస్తుంది. గతంలో సిద్దిపేట బ్రాండ్ అంబాసిడర్ గొల్లభామ చీరతోపాటు సంప్రదాయ పీతంబర పట్టు చీరలకు పురస్కారాలు లభించాయి. ఈ క్రమంలో ఈసారి సిద్దిపేట ఆదర్శ చేనేత సొసైటీలో నేత కార్మికుడు సిరిగాది నర్సయ్య పట్టుదారంతో గొల్లభామ ప్రతిమలతోపాటు చెక్ ప్యాట్రన్ పద్ధతిలో బార్డర్‌లో ట్రెడిషనల్ గొల్లభామ బొమ్మలతో నేసిన చీరకు అవార్డు లభించింది. అదే విధంగా ఇర్కోడ్ చేనేత సొసైటీకి చెందిన బుగ్గ శ్రీరాములు తేలికగా మగువల అభిరుచికి తగ్గట్టుగా నేసిన యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప కాటన్ చీర రాష్ట్ర స్థాయి అవార్డు సొంతం చేసుకుంది.

కష్టానికి తగిన ఫలం



అవార్డు పొందిన చీరతో..

నలభై ఏళ్ల చేనేత పనితనానికి ఇది గుర్తింపు. పేదరికంలో పుట్టి కుల వృత్తిపై ఆధారపడిన మా తండ్రి నుంచి నేర్చుకున్న. గొల్లభామ చీరలు తయారు చేయాలని అనుకున్న. జకార్డు మగ్గం మీద నాలుగు రోజులు కష్టపడి గొల్లభామ పట్టు చీర నేసిన, దానికి ప్రభుత్వ గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం ప్రోత్సాహమందిస్తే ఇంకా అద్భుతమైన చీరలను తయారీ చేస్తా.

– సిరిగాది లక్ష్మయ్య, ఆదర్శ చేనేత సొసైటీ సిద్దిపేట

చాలా సంతోషంగా ఉంది



రామప్ప చీరతో..

నేను నేసిన రామప్ప చీరకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. 50 ఏళ్లుగా ఇదే వృత్తిలో జీవనం సాగిస్తున్న. గతంలో గొల్లభామ, పోచంపల్లి, ఘరానా చీరలు నేసిన. కొత్తగా ఏదైనా నేయాలని ఏడు రోజులు కష్టపడి రామప్ప కాటన్ చీర తయారీ చేసిన దీన్ని కూడా జకార్డు మగ్గం మీద నేయొచ్చు. ప్రభుత్వం మాలాంటి పేద చేనేత కార్మికులకు సాయం చేయాలి.

– బుగ్గ శ్రీరాములు, ఇర్కోడ్ చేనేత సొసైటీ సిద్దిపేట

చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి

– మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దుబ్బాక : కులవృత్తికి ఆదరణ కరువై ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతున్న చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, దుబ్బాక పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేశ్, నాయకులు మల్లుగారి రాంచంద్రారెడ్డి, తునికి సురేశ్ హైదరాబాద్‌లో మంత్రిని కలిసి దుబ్బాక చేనేత తకార్మికులు తయారు చేసిన వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు కార్మికుల కష్టాలను మంత్రికి వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి చేనే తకార్మికులకు చేతినిండా పని కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భర్త కళ్లెదుటే భార్య మృతి

- బైక్‌ను ఢీకొట్టిన మోటారు సైకిలిస్టు
- కొల్చారం, చిలప్‌చెడ్‌లో ఆటోలు అదుపుతప్పి ఇద్దరు
- మరోచోట కుక్కను తప్పించబోయి ఒకరు

జహీరాబాద్ టౌన్: దంపతులు బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్త, కూతురికి గాయాలయ్యాయి. చిరాగ్‌పల్లి పోలీసుల కథనం మేరకు.. న్యాల్‌కల్ మండలంలోని రాంతీర్థానికి చెందిన సిద్దు(36) టైలర్ పని చేస్తూ జహీరాబాద్ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. కర్నాటక రాష్ట్రంలోని మన్నెకల్లి గ్రామంలో బంధువుల వద్ద ఫంక్షన్‌కు హాజరై భారత్ ఫైనాన్స్ ఇన్‌క్లూసిన్ బ్యాంక్‌లో డబ్బు డ్రా చేసుకునేందుకు భార్య అంబిక(30), కూతురు తేజస్విని(2)తో కలిసి మోటారు బైక్‌పై వెళ్లాడు. తిరిగి జహీరాబాద్ పట్టణానికి వస్తుండగా జాతీయ రహదారిపై సత్వార్ గ్రామ శివారులో వెనుకాల నుంచి వేగంగా హైదరాబాద్ వైపు వెళ్తున్న మోటారు సైకిలిస్టు వీరి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అంబిక తలపగిలి అక్కడికక్కడే మృతి చెందింది. సిద్దు, అతడి కూతురికి గాయాలయ్యాయి. మోటారు సైకిలిస్టు కూడా స్వల్పగాయాలయ్యాయి. ఎస్ఐ.రాజేందర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కను తప్పించబోయి వ్యక్తి..

కొమురవెల్లి(సిద్దిపేట): ద్విచక్ర వాహనంపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేకు.. కిష్టంపేట గ్రామానికి చెందిన మాదాసు శ్రీహరి(31) ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండు రోజుల కిందట ఫోన్ పాడైపోగా రిపేర్ కోసం మంగళవారం రాత్రి చేర్యాలకు అతడి బావమరిది రాజుతో బైక్‌పై వెళ్లాడు. అనంతరం దొమ్మాట నవీన్, మాదాసు నవీన్‌తో కలిసి ముస్త్యాలలోని బంధువుల ఇంటికి పుట్టినరోజు ఫంక్షన్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చేర్యాలలోని ఓ బార్‌లో మద్యం సేవించారు. రాత్రి 11 గంటల సమయంలో బైక్‌పై దొమ్మాట నవీన్‌తో కలసి కిష్టంపేటకు బయలు దేరాడు. గురిజకుంట బ్రిడ్జి సమీపంలో కుక్కను తప్పించబోయి ఇద్దరూ కిందపడగా శ్రీహరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెనుక వస్తున్న రాజు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య మాదాసు చైతన్య ఇచ్చిన ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

మిషన్ భగీరథ కంచెను ఆటోతో ఢీకొని..



ఆటోలోనే ప్రాణాలు వదిలిన శంకర్

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మెదక్–జోగిపేట రహదారి వరిగుంతం బస్ గేటు వద్ద బుధవారం చోటు చేసుకుంది. కొల్చారం ఏఎస్ఐ తారా సింగ్ కథనం మేరకు.. పాపన్నపేట మండలం అనసు మహమ్మద్ గ్రామానికి చెందిన నీలగిరి శంకర్ (38) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆటో పాడవడంతో రిపేర్ కోసం మెదక్ వెళ్తున్నాడు. అతివేగంగా నడుపుకుంటూ వెళ్తూ వరిగుంతం బస్ గేటు వద్ద రోడ్డుకు పక్కన ఉన్న మిషన్ భగీరథ పైపు లైన్ వాల్వుకు రక్షణగా వేసిన ఇనుప కంచెను ఢీకొట్టాడు. ఆటో ముందు భాగం దెబ్బతిని శంకర్ అందులోనే తీవ్ర గాయాలతో చనిపోయాడు. మృతుడి కుమారుడు నితిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా ఒకరు..

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆటో బోల్తా పడటంతో వృద్ధుడు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఏఎస్ఐ మిస్బావొద్దీన్ కథనం మేరకు.. మండలంలోని గణ్యతండా పంచాయతీ మల్లక్క చెరువు తండాకు చెందిన రాట్ల మోజ్యానాయక్(70) పొలానికి వేసే గడ్డిమందు కోసం చిలప్‌చెడ్‌కు సిద్ధం అయ్యాడు. అతడి కొడుకు గంగ్య బైక్‌పై గౌతాపూర్ వరకు దించి వెళ్లాడు. గౌతాపూర్‌లో మోజ్యానాయక్ ఆటో ఎక్కడగా డ్రైవర్ గోపాల్ అతివేగంగా నడపడంతో గుజిరితండా శివారులో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో మోజ్యానాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ గోపాల్‌తోపాటు మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. మృతుడి కొడుకు గంగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యమం చేసిన వారికి దక్కని న్యాయం

- కోదండరాంను కలిసిన ఉద్యమ కళాకారులు



కోదండరాంతో ఉద్యమ కళాకారులు

సిద్దిపేటరూరల్/ తొగుట(దుబ్బాక): రాష్ట్ర సాధన ఉద్యమంలో కళాకారులుగా తమ వంతుగా పోరాడినప్పటికీ తర్వాత తమకు ఎలాంటి న్యాయం జరగలేదని బుధవారం ప్రొ.కోదండరాంను తెలంగాణ ఉద్యమ కళాకారులు కలిసి వాపోయారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ.. పల్లెపల్లెల్లో ప్రజలను చైతన్యం చేస్తూ పోలీసుల లాఠీ దెబ్బలు, కేసులను సైతం పట్టించుకోకుండా గళం విప్పామన్నారు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాంస్కృతిక సారథి పేరుతో ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా 550 మందికి కళాకారులుగా ఉద్యోగాలు కల్పించారన్నారు. అప్పటి చైర్మన్ రసమయి బాలకిషన్ తనకు నచ్చిన వారికి, ఉద్యమంతో సంబంధం లేని వారికి ఇచ్చుకున్నారన్నారు. ఎన్నోసార్లు మంత్రులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. అలాగే, తొగుటకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు హైదరాబాద్‌లో ప్రొ.కోదండరామ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ కళా వేదిక జిల్లా నాయకులు చిన్నగుండెల్లి పరమేశ్, రాష్ట్ర కార్యదర్శి బందకాడి గణేశ్, సభ్యులు కల్వకుంట్ల స్వామి, ప్రజ్ఞాపూర్ నరేశ్, రాజక్కపేట రమేశ్, అందె ప్రవీణ్, తొగుటకు చెందిన గణేశ్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

మూడు కిలోల గంజాయి పట్టివేత

వట్‌పల్లి(అందోల్): మూడు కిలోల గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కే.శ్రీనివాసరావు కథనం మేరకు.. గంజాయి తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి అందోలు మండలం డాకూరు గ్రామ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. వట్‌పల్లి మండలం గౌతాపూర్ వాసి దొడ్లె మోయిద్దీన్ బైక్ తనిఖీ చేయగా 3 కిలోల 50 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. వెంటనే గంజాయి స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నాం. గంజాయి విలువ సుమారుగా రూ.1.80 లక్షల వరకు ఉంటుంది. నిందితుడిని జోగిపేట సబ్‌జైల్‌కు రిమాండ్‌కు పంపినట్లు శ్రీనివాసరావు తెలిపారు.తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వీణారెడ్డి, ఎస్ఐ అనిల్‌కుమార్, హెచ్‌సీ అలీం, సిబ్బంది రామారావు నాయక్, డీ.మల్కయ్య, కే.ఏ సతీష్ మోహన్, ప్రవీణ్‌రెడ్డి, వివేక్ పాల్గొన్నారు. బైక్‌పై ఇద్దరు యువకులు ఉన్నారని, అందులో ఇద్దరు తప్పించుకొని పారిపోయినట్లుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. నిందితుడి వెంట ఉన్న మరో వ్యక్తిని తప్పించారా? లేక అధికారులే వదిలేశారా అన్న అనుమానాల్ని స్థానికులు వ్యక్త పరుస్తున్నారు. ఈ విషయమై శ్రీనివాసరావును వివరణ కోరగా మోయిద్దీన్‌ను కస్టడీకి తీసుకొని విచారణ జరుపనున్నట్లు తెలిపారు.



పట్టుబడిన గంజాయితో అధికారులు

పీడీఎస్ బియ్యం, ఇసుక స్వాధీనం..

నంగునూరు(సిద్దిపేట): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంతోపాటు మూడు ఇసుక ట్రాక్టర్లను మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు రాజగోపాల్‌పేట ఎస్ఐ అసీఫ్ తెలిపారు. పాలమాకుల శివారులో రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా టాటాఏస్ వాహనంలో తరలిస్తున్న 5 టన్నుల బియ్యాన్ని పట్టుకొని డ్రైవర్ వంగ నగేశ్‌పై కేసు నమోదు చేశామన్నారు. అలాగే అక్కెనపల్లి పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఖాతా గ్రామ శివారులో పట్టుకొని డ్రైవర్లు చల్లా సత్తిరెడ్డి, సందిటి ప్రవీన్, పోతిరెడ్డి తిరుపతిపై సుమోటో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై విజయ్‌భాస్కర్ కథనం మేరకు.. హుస్నాబాద్ మండలం మీర్జాపూర్‌కు చెందిన భాస్కర్ సుమారుగా 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తుండగా మల్లంపల్లి గ్రామంలో పట్టుకున్నాం. ఆటో, బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వ్యక్తి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వీడ్ని ఎన్ని రోజులు భరిస్తాం

- మానసిక కుమారుడిని హత్య చేసిన తండ్రి
- తాగిన మైకంలో రోకలిబండతో దాడి
- పెద్దశంకరంపేటలో ఘటన



సాయిలు (ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): సపర్యలు చేయలేక మానసిక వికలాంగుడైన కుమారుడిని ఓ తండ్రి దారుణంగా హత్య చేశాడు. హృదయ విదారకమైన ఈ సంఘటన మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దశంకరంపేటలోని ఇందిరాకాలనీకి చెందిన పిరైనోల్ల సాయిలు, భూమమ్మలకు ప్రశాంత్, ప్రదీప్ (16) ఇద్దరు సంతానం. ప్రశాంత్‌కు వివాహం కాగా, పక్క పోర్షన్‌లో నివాసం ఉంటున్నాడు. చిన్నకుమారుడు ప్రదీప్(16) మానసిక వికలాంగుడు. సాయిలు హమాలీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రదీప్ మానసిక వికలాంగుడు కావడంతో అతనికి ప్రతిరోజు తండ్రి సపర్యలు చేసేవాడు. పనిచేయనిదే పూట గడవని ఆ కుటుంబంలో ఇదో పెద్ద సమస్యగా మారింది. కొడుకును సాకలేక.. సపర్యలు చేయలేక సాయిలు విసుగుచెందేవాడు. నిత్యం ఈ బాధలు భరించలేక కొడుకును అంతమొందిస్తేనే ప్రశాంతత ఉంటుందని సాయిలు భావించేవాడు. 'వీడిని ఎన్ని రోజులు భరిస్తాం' అని తరచూ ఇంట్లో కూడా గొడవ పడేవాడు. ఈ క్రమంలో బుధవారం మద్యం సేవించాడు. తాగిన మైకంలో విచక్షణ కోల్పోయి కుమారుడిపై రోకలిబండతో దాడి చేశాడు. దీంతో ప్రదీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డుకోబోయిన తల్లిని నెట్టివేశాడు. విషయం తెలిసిన మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, పెద్దశంకరంపేట ఎస్ఐ శంకర్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. నిందితుడు సాయిలును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా మృతుడి తాత పెంటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తండ్రిని చంపిన కుమారుడు

- మద్యం సేవించి వేధిస్తున్నాడని హత్య



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

కోహెడరూరల్(హుస్నాబాద్): వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన మండలంలోని వరికోలు గ్రామంలో చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎండీ (ఫకీర్) నబీ(50) మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతుండేవాడు. కొంత కాలంగా భార్య బిపాష, కుమారుడు జావీద్‌కి దూరంగా హైదరాబాద్‌లో ఫకీరు పని చేస్తూ దుకాణాల్లో పొగ(ఊదు) వేస్తూ వచ్చిన డబ్బులతో జీవిస్తున్నాడు. ఇటీవల కూతురికి వివాహం జరుగగా భార్య, కుమారుడు సైతం గ్రామం నుంచి వెళ్లి హైదరాబాద్‌లోనే అతడికి దూరంగా ఉంటున్నారు. మంగళవారం రాత్రి నబీ మద్యం మత్తులో వారు ఉండే చోటుకు వెళ్లి వేరే వాళ్లవి రెండు ఆటోలను ధ్వంసం చేసి భార్యాకుమారుడిపై దాడికి దిగాడు. విసిగిపోయిన బిపాష, జావీద్ వాహనంలో నబీని తాడుతో కట్టి స్వగ్రామం వరికోలుకి తీసుకొచ్చారు. తరచూ గొడవలు పడుతూ హింసిస్తున్నాడని కోపంతో గ్రామ శివారులోని ముస్లిం సమాధుల వద్ద గొంతు నులిమి హత్య చేసినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. ఉదయం అటుగా వెళ్తున్న ఓ పశువుల వ్యాపారి మృతదేహాన్ని చూసి గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ తిరుపతి ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీం ద్వారా హత్య ప్రదేశంలో ఉన్న రక్తపు మరకలు, మద్య సీసాలు పరిశీలించారు. తండ్రిని తానే హత్య చేసినట్లు కుమారుడు జావిద్ పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

– ప్రధాన నిందితుడు పరారీలో..

తూప్రాన్: చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ శివానందం బుధవారం పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. జులై 9న నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు రాజధాని బస్సులో ప్రయాణిస్తున్న అమీన్ అబ్దుల్ లాలని అనే ప్రయాణికుడి రూ.5 లక్షల బ్యాగ్‌ను పట్టణ సమీపంలోని దాబా హోటల్ వద్ద బస్సు నిలిపిన సమయంలో కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు చోరీకి నిందితులను పట్టుకున్నారు. ఇందులో మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన సురాజ్ పండిత్, సంతోష్ సయాబ్‌రావు,సునీల్ అర్జున్‌జాదవ్ ఉన్నారు. ప్రధాన నిందితుడు సునీల్ పండిత్ పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.